కిటుకు

ఏమిటేమిటో తీయగా ఊహించుకొన్న కమల - శోభనపు పెళ్లికూతురయి — గదిలో అడుగిడబోతున్నది.

ఆ సమయంలో ఆమె అత్త, రాజేశ్వరి పనికట్టుకు — ఆమెను దొడ్లోకి పిలుచుకు పోయింది.

“ఏమిటి అత్తయ్యా” — అంటూ వినయంగా కమల అత్తననుసరించింది.

వాళ్లు దొడ్లోకి వచ్చారు.

“ఏం లేదమ్మా. నువ్వు తెలివయినదానివి. భర్త నేవిధంగా చూచుకోవాలో నీకు తెలుసు ననుకుంటా. అయినా వాడి తల్లిగా నువ్వు నా కోడలువు కనుక నయంగా నీకో సంగతి చెప్పటానికి పిలిచానమ్మా...” అంది రాజేశ్వరి చెప్పబోయేది చెప్పకుండానే.

“ఏమిటత్తయ్యా - అది” — అంది తిరిగి కమల...

“అబ్బాయికి కోపం యెక్కువమ్మా.... వాడికి ప్రతికూలంగా నువ్వేమాత్రం మసులుకు పోయినా — వొళ్లు తెలియని ఆవేశం వాడికి. ఆ ఆవేశంలో వాడు మంచి చెడ్డలు గుర్తించకుండా యిష్టం వచ్చినట్లుగా మసులుకు పోతాడు. తప్పేది తగినేదీ తెలియని పరిస్థితికి వాడప్పుడు వస్తాడు. అంగుకని... మిగిలిన మాటలు పూర్తి చేయకుండా రాజేశ్వరి నవ్వింది.

కమల అక్కడికక్కడే వణికిపోయింది. తానింతవరకూ ఒక విధంగా వూహించింది... తన వూహాలన్నీ కలలే నన్నమాట! వెలవెలబోతూ ‘అయితే నన్నేం చేయమంటా రత్తయ్యా?’ అంది అమాయకంగా, కమల.

“ఏం చేయటానికేముందమ్మా! వాడి యిష్టానుసరించి నడుచుకుపోవటమే. అలా చేస్తే — వాడు నిన్ను నెత్తిమీద పెట్టుకొని పూజచేస్తాడు. మరి గొడవుండదు. తెలిసిందా” — అంది ఆవిడ తిరిగి నవ్వి!

“అలాగే అత్తయ్యా” — అంది యెలాగో కమల యేమిటో ఆలోచిస్తూ.

“మంచిదానవ్ తల్లీ” — అంటూ రాజేశ్వరి అంటూండగానే —

ఓగేటి శివరామకృష్ణ

“అమ్మాయ్ ఇప్పటికే చాలా ప్రొద్దుపోయింది. పెండ్లికూతురెక్కడ” — అంటూ యెవరో దొడ్లోకి రాబోయారు.

అంతటితో వారు సంభాషణ చాలించి యింట్లోకి వచ్చారు.

* * * *

అది శోభనం గది —

శోభనపు పెళ్లికొడుకు సంజీవరావు — మంచంమీద జార్లగిలి పడుకొని - భార్యరాక కోసం కుతూహలంతో యెదురుచూస్తున్నాడు. నిమిషాలు గడుస్తున్నాయ్... కాని ఆమె రాక మాత్రం ఆలస్యం అవుతోంది...

పది హేను నిమిషాలు గడిచాయ్...

భార్య గదిలోకి రావటంతోటే — పరిస్థితిని బట్టి చెంపపెట్టు సహితం పెట్టుదామనుకుంటున్నా డతను.

అటువంటి సమయంలో బయట గాజులు గలగలమన్నాయ్!

ముత్తయిదువులతో శోభనపు పెళ్ళికూతురు కమల గదిలో ప్రవేశించింది. ఆమె రాకతో సంజీవరావు కోపం సహితం — తాత్కాలికంగా మాయమయింది. సహృదయంతో భార్య నాహ్వానించుదామనుకొన్నా డతను.

ముత్తయిదువులు కమలను గుమ్మంముందు వదలి వెళ్ళిపోయారు. బయట గొళ్లెం వేయటం జరిగిపోయింది. కమల మాత్రం — గడియ వేయకుండా — ఓరగా భర్తవయిపు చూస్తూ అత్త చెప్పిన మాటలు గుర్తునకు రావటంవల్ల గుండెదడ మూలకంగా — అనుకూలంగా ప్రవర్తించవలసిన విధానంగురించి ఆలోచిస్తూ అక్కడే నిలబడిపోయింది.

పది నిమిషాలు తిరిగి గడిచాయ్.

మంచంమీద భార్యరాకకోసం యెదురుచూస్తున్న సంజీవరావు ముఖకవళికల్లో మార్పు వస్తున్నది; తీవ్రత అతడి వదనంలో ప్రవేశించబోతున్నది - అటువంటి పరిస్థితిలో — గది బయటనుంచి —

నవ్వులు వినిపించినాయ్!

“లోపల మాటలేం వినపడటం లేదే” — అంటున్నా రెవ్వరో!

“మూగగానే మాట్లాడుకుంటున్నారు కాబోలు” — అంటున్నారు మరొకళ్లు.

“ఏడిశారు గాని నడవండి బయటకు” — అని యెవరో అనటంతో గుమ్మందగ్గర కాపున్నవాళ్లు మెల్లగా జారుకొన్నారు...

కమలకు ముచ్చెమటలు పోశాయ్.

ఆమెకు యేం చేయాలో యేమిటో తెలియని పరిస్థితి యిప్పుడేర్పడింది... ఇంకా ఆమె అక్కడే నిల్చుంది.

మరో కొద్దికాలం గడిచింది...

సంజీవరావులో కోపం యిప్పుడు పూర్తిగా ప్రవేశించింది. అతడిలో ఓర్పు నశించింది —

భార్యను లాలనగా ఆహ్వానించింది లేదు సరిగదా — “నీకేం బుద్ధి లేదూ? అలా ఎంతసేపు నిలబడతావ్?” అని కసిరాడు.

కమల కొయ్యబారిపోయింది!

భర్త ఆవిధంగా అంటాడని ఆమె వూహించలేదు. అనురాగంతో ఆహ్వానించటానికి బదులు - ఆగ్రహంతో ఆహ్వానించటమా?

కమలనోట మాటలు నెమ్మదిగా వచ్చాయి ..“నా..ళ్లు...వు..న్నా..రు... తలుపు”



"నీ గొప్ప" - కర్కశంగా అన్నాడు సంజీవరావు.

కమల హడలిపోయింది...

ఏం చేయాలో యేమిటో ఆమె కిప్పు డర్థం కావటం లేదు.

తిరిగి గదిబయట నవ్వులు....

"భళ్ ...మీ కేమాత్రం బుద్ధి లేదర్రా మళ్లా తయారయ్యారు. నడవండి. ఈ గది గూడా తాళం వేసిపారేస్తాను."

అవతల గదికి గూడా తాళం వేసినట్లు చప్పుడు విన్పించింది. "మరి రారు. బ్రతుకు జీవుడా" అనుకుంటూ జాలికలిగేటట్లు భర్త వయిపు చూసింది కమల. ఫలితం—గజగజ లాడిపోవటం.

సంజీవరావులో ఆగ్రహం మరింత అభివృద్ధి నొందింది.

అనురాగం పొందటానికి గదిలో ప్రవేశించిన తాను - ఆగ్రహం పొందబోతూన్నట్లున్నది. మరి జాగుచేయకూడదు ఈ విధంగా మనస్సులో నిశ్చయించుకొని, సిగ్గును దూరంగానెట్టి - తలుపు గడియ వేసుకొని మందగమనంతో మంచంవద్దకు పోయి నిల్చుంది కమల.

అంతవరకూ - కళ్లు తెరచుకొనివున్న సంజీవరావును కోపంతో బాటు దొంగనిద్ర కూడా ప్రవేశించింది.

అతను కళ్లు మూశాడు!

వెలవెలబోతూ, మృదువుగా "ఏమండీ" అని, అనురాగం వ్యక్తపరచటంకోసం - తలలో పూవు నొకదాన్ని తీసి, భర్త ముక్కు ముందు పెట్టబోయింది.

"ఛస్" - అంటూ సంజీవరావు మంచం మీంచి లేచి కూర్చుని: "పొగరుబోతు పీనుగా" అన్నాడు గట్టిగా.

కమలకళ్లల్లో నీళ్లు నిల్చాయి. ఇంతవరకూ ఆమె యెవరిచేతా తిట్లు తినలేదు. అభిమానంవల్ల ముందువెనక లాలోచించకుండా "నే నేం పొగరుబోతు పీనుగను కాను" - అనేసి తర్వాత అలా అన్నందుకు మిక్కుటంగా బాధపడింది.

భర్తప్రవృత్తి, తెలుసుకొని వుండి కూడా, అత్త చెప్పిన సంగతులు గుర్తుంచుకొని కూడా, నోరుజారి, తానావిధంగా అనేసింది —

తర్వాత యేమనుకుంటే యేం ప్రయోజనం?

అంతమాత్రానికే సంజీవరావుకు కోపం నెత్తికెక్కివచ్చింది. అతగాడు తానెక్కడ వున్నదీ మరచిపోయాడు. తాను వాంఛించేదేమిటో - అదేవిధంగా పొందాలో - కొద్దిమాత్రమయినా ఆలోచించకుండా "కాకేం" అంటూ మంచంమీంచి లేచి, కమల చెంపమీద, అయిదు వ్రేళ్ళూ అంటేలాగ ఒక దెబ్బ వేశాడు!

కమల దవడ ఎఱ్ఱపడి వాచింది! ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆమె తీయగా వూహించుకొన్న వూహాలన్నీ యీవిధంగా అడ్డం తిరుగుతున్నాయి. కోపం సహితం ఆమెలో ప్రవేశించింది. కానీ - తానెవరో యిప్పుడు ఆమె గుర్తించుకొంది...తోడుగా అత్తమాట లిప్పు డామెకు జ్ఞాపకం వచ్చాయి...

కమల - భర్తఅనురాగం పొందటం - తన విధి అనుకొంది - అందువల్ల చెంప చెళ్లుమన్నా కిమ్మనలేదు...

పిచ్చిగా నవ్వుతూ, సంజీవరావు, ఆమెను అధీనం చేసుకున్నాడు.

భర్తనుగురించి దృఢఅభిప్రాయం కమలలో నాటుకుపోయింది: అతనికి కోపం యెక్కువ. అతగాడి మాటను జవదాటకూడదు - ఏమాత్రం అభ్యంతరం చెప్పకుండా - ఆయన యిష్టాన్ని గుర్తించి - దాని ప్రకారం నడుచుకుపోతూండాలి. అంతే. లేకుంటే దవడ వాపవుతూంటుంది!

* * *

కొంతకాలం గడిచింది...

కమల యిప్పుడు అత్తవారింటికి కాపురం చేయటానికి వచ్చింది...

అత్త రాజేశ్వరి, కమలను-కన్న కూతురిలా చూసుకుంటున్నది ... ఇంట్లోవాళ్లంతా, కమల నావిధంగానే చూస్తున్నారు.

కమల - అందరితోనూ యెంతో హితవుగా వుంటూ అందరి అభిమానం పొందుతూన్నది. కమల మామగారు సహితం "కమల మన అదృష్టంకొద్దీ మన యింటి కోడలుగా లభించింది -" అని సంతోషిస్తున్నాడు.

సంజీవరావుమాత్రం - భార్యమీదల అనురాగం ప్రదర్శిస్తున్నా, అప్పుడప్పుడు కోపంతో ఆమెను బాధపెడ్తున్నాడు.

ఏమయినా కమలమాత్రం అత్తింట వున్నా - ఒకేఒక అభిప్రాయంలో ఉండిపోయింది - తన భర్తకు - కోపం - తిక్క యెక్కువ అది అంతకంతకు వృద్ధి అవుతోంది. తాను ఆ కోపానికి ... తిక్కకు - వశం అయిపోతోంది ... దవడలు వాపవుతున్నాయ్! భర్త తిక్క - కోపం యేవిధంగా పోతాయో ఆమె కర్థం కావటం లేదు "అవి పోగొట్టడ మెలాగ?" -

కమల ఆలోచిస్తూండగానే రోజులు గడుస్తున్నాయ్ ... కమలసమస్య సమస్యగానే వుండిపోతూంది...

రాజేశ్వరి కళ్ళనీళ్లు పెట్టుకొనేది. "అంతా నాఖర్మం బంగారంలాంటిపిల్ల దెబ్బలతో నలిగిపోతూంది. వాడికి చేతు లెలా వస్తున్నాయో కొట్టడానికి. వెధవకోపం వాడూను ఆకోపం యెప్పటికి పోతుందో యేమో" అనుకునేది...

అందరి అనురాగంతో బాటూ - ఆ దెబ్బల అనురాగంతోటూ కమల పొందుతూండగా రోజులు సాగిపోతున్నాయ్...

* * *

కమల పుట్టింటికి వచ్చింది ... ఇంట్లో వాళ్లంతా కమలను కొత్తగా చూశారు:

"ఇప్పుడయినా మీ ఆయనకు కోపం తగ్గిందా?" - అని నవ్వుతూ అడిగింది తల్లి!

"కోపం తగ్గితే - అక్కయ్య ఆలా యెందుకు చిక్కిపోతుందమ్మా?"-అన్నాడు కమల తమ్ముడు.

కమల సిగ్గుతో తల దించుకొంది!

"బావకోపం - తిక్క తగ్గడానికి యేమైనా మందు దొరికితే బాగుండును" అన్నాడు కమల చిన్నతమ్ముడు!

"అవును" - అని కమలతల్లి అంటూంటే - అంతా ఒక్కమారుగా నవ్వారు. కమల సిగ్గుతో తల వంచుకొంది

* * *

ఒకదినం - సాయంకాలం -

కమలను చూడటానికై ప్రక్క వీధిలో వుంటున్న ప్లీడరుగారికోడలు యిందిర వచ్చింది.

ఇందిరను, కమలతల్లి పరిచయం చేసింది: "ఈవిడది మీ అత్తవారివూరే... అన్నట్లు...మీ ఆయనా- ఈమే కలసి చదువుకొన్నారట" అని...

ఇందిర నవ్వింది.

కమల - సిగ్గుతో ఇందిరవయిపు చూసింది.

కమలతల్లి యేదో పని మీద వంట యింట్లోకి వెళ్ళిపోయింది ... కొత్తగా వరి

ఏం, తలనొప్పి కొనుటకు వెదుకుతున్నారా!



సారిడన్

నొప్పిని పోగొట్టును

ఒక బిళ్ల 2 అణాలు

చయులైన యిద్దరు స్నేహితురాండ్రూ అనేక విషయాలు మాట్లాడుకొన్నారు. ఆ మాటలసందర్భంలో ఇందిర నవ్వుతూ: "ఏమండీ? మీ ఆయనకోపం యేలాగుంది?"- అని అడిగింది.

కమల చెప్పలేక వెలవెలబోయింది:

ఇందిర నవ్వుతూ! "మీరు చెప్పక పోయినా...నాకంతా తెలుసండీ ... మేం ఒకేవూరివాళ్లం. మీ ఆయనకు పెద్దగా కోపం అని - తాబట్టిన కుందేటికి మూడే కాళ్లని మీరు భయపడతారుగానీ నిజంగా ఆయన పిరికిమనిషి! - ఆయనదంతా మేకపోతుగాంభీర్యం..."

కమల తెల్లబోయి చూసింది. "మీ మాటలు నాకర్థంకావటంలేదు" - అంది.

ఇందిర నవ్వుతూ చెప్పసాగింది: "నా మాటలు మీకర్థంకాకపోయినా - నే చదువుకొనేరోజుల్లో జరిగిన కథ వింటే - మీకంతా అర్థం అవుతుంది: -

మీ ఆయనతోబాటు సరళ అనే అమ్మాయి చదువుకుంటూండేది; ఆమె అందగత్తె అవటంవల్లా, భాగ్యవంతుల పిల్ల అవటంవల్లా, చదువు సంధ్యలలో తరగతికి ముందుగా వుండటంవల్లా - తరగతిలో అందరినీ ఆకర్షించేది. కొత్తగా తయారైన ఫాషన్లేమైనా వుంటే - అవి ఆమెదగ్గరే ప్రారంభమవుతూండేవి.

ఆ అమ్మాయంటే తరగతిలో మొగపిల్లలందరికీ వేళాకోళంగా వుండేది. అందరూ తలో కొత్తపేరూ పెట్టి - ఆమెను నోట్లో వేసుకుంటూండేవారు.. నలుగురితోబాటూ నారాయణా అన్నట్లు మీవారుగూడా ఆ అమ్మాయికి ఒక పేరు పెట్టారు! ఆ పేరు ఆకర్షణీయంగా వుండటంవల్ల - అందరి పిల్లలూ ఆ పేరుతోనే సరళను పిలవసాగారు" - ఒకమారు ఆగి కమలవయిపు చూసి నవ్వింది ఇందిర!

"ఆ అమ్మాయి హెడ్‌మాస్టారికి రిపోర్టు చేసిందా?"- అమాయకంగా అడిగింది కమల.

"సరళ అంత తెలివితక్కువది కాదు. మేమంతా రిపోర్టు చేయమన్నాం. కాని ఆమె: 'ఇంత చిన్నవిషయం హెడ్మాష్టరు దగ్గరకెందుకూ... నేనే దాన్ని పరిష్కరిస్తాను' - అంటూ మాతో చెప్పింది.

మర్నాడు—

తరగతిలో సరళ యేకాంతంగా మీవారిని కలుసుకుని 'మీతో మాటాడాలనుకొంటున్నాను' అందట

మీవారు ఉబ్బిపోయి 'సరే'—అన్నారట.

'నాకు-పేరు పెట్టింది మీరేకదూ?'- నవ్వుతూ అడిగిందట సరళ.

'ఆ నేనే'—అన్నారట మీవారు.

'చాలా బాగుంది కాదూ?'—అందిట సరళ.

'ఆ...ఇంతకీ మీరు మాటాడాల్సినదేమిటి?'—అని ప్రశ్నించారట మీవారు.

"ఏం వుందిలెండి.....అంత చక్కటి నామం - నాకు యిచ్చిన మీకు కృతజ్ఞత చెప్పుకోని బహుమానం యివ్వాలనే తలంపు నాకు కలిగింది...ఆ బహుమానం అందరిలో యివ్వటంకంటె - మీకు - యేకాంతంగా యివ్వటం సబబుగా తోచటంవల్ల మిమ్మల్ని కలుసుకోన ప్రయత్నించాను. నేటికది సమకూడింది. ఇక మీ బహుమానం'— అంటూ సరళ—

ఒకవయిపు మీవారు తెల్లబోతూండగా 'ఇదుగో'—అంటూ అయిదు వేళ్ళూ అంటేలా దవడమీద వాయించిందట...ఈ సంగతి సరళ తర్వాత మాకు చెప్పింది"—

"తర్వాత"—అంది ఆదుర్దాగా కమల.

"తర్వాత యింకేముంది? దవడవాయించి సరళ వెళ్ళిపోయింది మీవారు వాచిన దవడ మూలకంగా వారం రోజులు బడికి రాలేదు. అంతే కాదు - ఆడపిల్లలంటే - ఆసక్తి చూపించే మీవారు గాని తరగతిలో వుండే యితర విద్యార్థులు గాని అప్పటినుంచీ-మావయిపు కన్నెత్తి చూస్తే వొట్టు. మమ్మల్ని గురించి-తిరిగి ఒక్క మాటయినా అన్నది లేదు. మీవారు అప్పటినుంచీ- యెక్కడయినా - మేం కన్పించినా - తలదించుకు నడిచేవారు. సరళ పేరు యెవరయినా చెబితే గజగజలాడిపోయేవారు; అందువల్ల-నే చెప్పేదేమంటే-మీవారిది కచ్చితంగా మేకపోతుగాంభీర్యం .." అని నవ్వింది ఇందిర.

"అంతేనంటారా?"— అంది ఏమిటో ఆలోచిస్తూ కమల!

"అవునో కాదో యీమారు ప్రత్యక్షంగా - మీరే చూడండి. చీకటి పడుతూంది.....వస్తాను"—అంటూ ఇందిర లేచింది:

"ఉండండి బొట్టు పెడ్తాను"—అని, కమల బొట్టు పెట్టింది. తరవాత భర్తను గురించి ఆలోచించసాగింది.

* * *

కమల పుట్టింట వుండగానే భార్యకోసం సంజీవరావు వచ్చాడు. ఆ రాత్రి కావాలని - కమల యేదో తప్పిదంచేసింది.

కోపం అప్పటికప్పుడే సంజీవరావులో ప్రవేశించింది...అతగాడు వళ్లు తెలియని కోపంలో: "నీకేం బుద్ధిలేదూ?"అన్నాడు.

"లేకేం"—అంది కమల కటువుగా.

ఆ మాట - సంజీవరావుకు మరింత కోపాన్ని తెప్పించింది...

"ఉంటే యేమిటిది?"—అంటూ కమలను కొట్టడంకోసం చేయెత్తిబోయాడు సంజీవరావు.

కమల వుగ్రరూపం తాల్చింది: "కొట్టండి మీకు చేతనైన విద్య అది వొక్కటేగా. లోకువగా వున్నానుకనుక యింతకాలం - నన్ను బాదారు; నా ముఖాన్ని వికృతంగా చేసిపారేశారు. మీకు చేతనైంది కోపం తెప్పించుకోటం; లోకువగా వున్నవాళ్లను చితక బాదటం. మీరు నన్ను యెన్ని విధాలుగా బాధించినా - యేడ్పించినా సహించాను; సహిస్తున్నాను. మీ దెబ్బలతో నా వొళ్లు కాయలు గాచిపోయింది. కానీ నేను కనుక మరోలా ప్రవర్తిస్తే? అదెంతసేపు! అంతెందుకూ? నేనుమాత్రం తల్చుకుంటే మీ క్లాసుమేటు సరళ మాదిరిగా చేయలేనూ?..."

—ఈ విధంగా కమల మాట్లాడుతూంటే సంజీవరావు వెలవెల బోయాడు. సరళపేరు వుచ్చరించటంతోటే, అతని వదనం వాడిపోయింది...చేతులు వణికాయ్; కళ్లు చమర్చాయ్.

కమల యింకా యేమేమో అని "...ఊ కొట్టండి. మీకు చేతనైంది అది ఒక్కటేగా" అని వుద్రేకంతో అంటూంటే—

సంజీవరావు గజగజ వణికిపోతూ, చమర్చిన కళ్లు తుడుచుకుంటూ—

"కమలా! ఇంతవరకూ నీకు చాలాఅన్యాయం చేశాను. నన్ను క్షమించు ... నా వొళ్లు నాకు తెలియని వుద్రేకపరిస్థితిలో నిన్ను కొట్టాను. నేటితో నాకు బుద్ధి తెలిసివచ్చింది. ఇక మరోవిధంగా మసలను"—అన్నాడు.

కన్నీటితో నిండిన కమలవదనం—కలకల లాడింది—

ఆమెను భర్త క్షమించమని కోరినందుకు కాదు—ఆమె కిటుకు పారినందుకు. ★

శ్రీ వత్స వారి

శ్రీ కాఫ్

దగ్గు, ఉబ్బసములకు దివ్యౌషధము

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

రెండు భాగములు

ఒక్కొక్క భాగం రు. 3-8-0

ఆంధ్ర గ్రంథమాల,

మద్రాసు-1